పద్మారావుగౌడ్ గెలుపు ఖాయం

కాచిగూడ, మే 15 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గండికోట జనార్దన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల వారి కోసం చేపట్టిన సంక్షేమ పథకాలే పద్మారావుగౌడ్ గెలుపునకు దోహదపడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్‌కు సికింద్రాబాద్ పార్లమెంట్ పీఠం దక్కుతుందని బస్తీ, కాలనీ ప్రజలు ధీమా వ్యక్తం చేశారన్నారు. సమస్యలను పరిష్కరించడంలో పద్మారావుగౌడ్ సఫలమయ్యాడన్నారు.

కవాడిగూడ, మే 15 : సికింద్రాబాద్ ఎంపీగా తీగుళ్ల పద్మారావు గౌడ్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర కోక ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం అభివృద్ధి పద్మారావు గౌడ్‌తోనే సాధ్యమన్నారు. పద్మారావు గౌడ్ యాభై వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొమ్ము రాజేశ్, భూతములు ఆంజనేయులు, రాజ మౌళి గౌడ్, వినయ్, కిరణ్, చంద్రకాంత్‌చ శ్యామ్ గాడే, భరత్ పాల్గొన్నారు.

నాలాల గుండా..నీరు సాఫీగా పోయేలా

- స్పీడందుకున్న పూడికతీత పనులు
- మే 31లోపు పూర్తిచేసేందుకు చర్యలు

అబిడ్స్, మే 15 : వర్షాకాలంలో వానలు కురిసినప్పుడు నీరు నాలాల గుండా సాఫీగా పోయేందుకు అధికారులు చేపట్టిన పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయం పరిధిలోని జోనల్ పరిధిలోకి వచ్చే కార్వాన్, నాంపల్లి, గోషామహల్, జూబ్లీ హిల్స్, ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయాల పరిధిలోకి వచ్చే నాలాల్లో మొత్తం 63 పూడికతీత పనులు 171.256 కి.మీ.లో చేపట్టేందుకు రూ.10.73 కోట్ల నిధులను విడుదల చేసిన విషయం విదితమే. ఆయా నిధులతో నాలాల పూడికతీత పనులను చేపట్టేందుకు గాను అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. వెంటనే నాలాల పూడికతీత పనులను ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. గత నెల వరకు 53.96 కి.మీ. వరకు పనులను పూర్తి చేసిన అధికారులు మే నెలాఖరుకల్లా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు గాను పనులను చేపడుతున్నారు.

సకాలంలో పనులు పూర్తి చేస్తాం

జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నాలాల పూడికతీత పనులు స్పీడందుకున్నాయి. జూన్ రెండో వారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా పనులు చేపట్టారు. మే నెలాఖరులోపు నాలాలోని పూడికతీత పనులు పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో 63 పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం.

- సహదేవ్ రత్నాకర్, ఎస్ఈ

ఫస్ట్‌ల్యాన్సర్ ప్రాంతంలోని నాలాలో పూడికతీత పనులు కొనసాగుతున్న దృశ్యం

సమీక్ష సమావేశంలో..

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగిన ఎంపీ అభ్యర్థులతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నిర్వహించిన సమీక్ష సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

- అబిడ్స్

అంబర్‌పేటలో తగ్గిన పోలింగ్

- 2019 పార్లమెంటు ఎన్నికల్లో 52.78 శాతం పోలింగ్
- 2024 పార్లమెంటు ఎన్నికల్లో 0.69 శాతం తగ్గుదల

అంబర్‌పేట, మే 15 : గత 2019 పార్లమెంటు, ఇటీవల 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే ఈ పార్లమెంటు (2024) ఎన్నికల్లో అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ శాతం తగ్గింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో 52.78 శాతం పోలింగ్ నమోదైంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 52.34 శాతం పోలింగ్ జరిగింది. కానీ మూడు రోజుల క్రితం జరిగిన 2024 పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం కొద్దిగా తగ్గింది. 51.65 శాతం నమోదైంది. ఇది అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే 0.69 శాతం తక్కువ. అంటే రెండువేల ఓట్ల పోలింగ్ తగ్గినట్లు లెక్క. అంబర్‌పేట నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,77,924 ఓట్లు ఉండగా 1,44,581 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 74,034 మంది ఓటు వేయగా.. మహిళలు 70,545 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

సికింద్రాబాద్, మే 15 : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి సుభాష్ చంద్రబోస్ నగర్ వరకు రూ.17 లక్షలతో జరుగుతున్న పైపులైన్ పనులను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారి ఏఈ కౌశిక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సామల హేమ మాట్లాడుతూ.. పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

వాహనాలకు.. నంబర్ ప్లేట్ తప్పనిసరి

నంబర్‌ప్లేట్ తప్పనిసరి ఉండాలని, లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. బుధశారం సీఐ అధ్వర్యంలో నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. అడ్మిన్ ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

నీటి సమస్యలు పరిష్కరించండి

తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ ఖాద్రి అన్నారు.బుధవారం గోషామహల్ నియోజకవర్గంలోని ట్రూప్‌బజార్ ఉర్దూ గల్లీలో ఎమ్మెల్సీ, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పర్యటించారు. స్థానికులు నీటి సమస్యలపై ఫిర్యాదులు చేయడంతో వెంటనే జీఎం షరీఫ్‌ను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

- అబిడ్స్

మెహిదీపట్నంలో ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం డివిజన్‌లో బుధవారం నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ పర్యటించారు. ప్రజలకు ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. బస్తీలు,కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

- మెహిదీపట్నం

జాబ్ మేళాకు విశేష స్పందన

అబిడ్స్, మే 15 : నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించాలనే సంకల్పంతోనే జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు డెక్కన్ బ్లూస్టర్స్ ఎండీ, నిర్వాహకులు మన్నన్‌ఖాన్ ఇంజనీర్ తెలిపారు. మెహిదీపట్నంలోని హుమాయూన్‌నగర్ కన్వెన్షన్ హాల్‌లో 150 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల నుంచి ఆఫర్ లెటర్లను సాధించారు. మన్నన్‌ఖాన్ ఇంజనీర్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా నిర్వహించే జాబ్ మేళాకు వివిధ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయన్నారు. నెలకు కనీసం ఒక జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఆఫర్ లెటర్లను రోమానిక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎండీ రబ్బాని పాషా, జహీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ ఫరీద్, రోమానిక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎండీ షకీల్ పాషా, మన్నన్ ఖాన్ ఇంజనీర్ అందజేశారు.

నిరుద్యోగికి ఆఫర్ లెటర్ అందజేస్తున్న రోమానిక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రబ్బాని పాషా, నిర్వాహకులు మన్నన్‌ఖాన్ ఇంజనీర్

ప్రతిభా పురస్కారాల ప్రదానం

పురస్కారగ్రహీతలతో విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

ముషీరాబాద్, మే 15 : రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బాల ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఛాయాగ్రహణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాట్య గురువు ఎస్.పి. భారతి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎం.కె.రాము, ములుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలరించిన.. సినీ సంగీత విభావరి

చిక్కా దేవదాసుకు పురస్కారాన్ని అందచేసిన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మే 15: కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కె. బాపిరాజు ఆధ్వర్యంలో గాయకులు రేవతి, శ్రీమణి, శివరామకృష్ణ, అరుణ్, రుక్మిణి, సీతారామరావు, రాధాకృష్ణ, సీతారత్నం, సుబ్బిరెడ్డి, వెంకటేశ్వర్ అలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. కార్యక్రమానికి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సామాజిక, ఆధ్యాత్మికవేత్త చిక్కా దేవదాసుకు సహస్ర సేవాధురీణ బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీపీ సుంకర సత్యనారాయణ, చిక్కా రామదాసు, చింది బద్రీనాథ్, వసంత రాయులు, రాజు నేత, లక్ష్మి, నరేందర్, సురేందర్ పాల్గొన్నారు.

స్విమ్మర్ విక్టోరియాకు డాక్టరేట్

కాచిగూడ, మే 15 : బర్మత్‌పురకు చెందిన స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియాకు డాక్టరేట్ లభించింది. డేస్ స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్‌లో ప్రతిభ కనబర్చిన ఆమెకు సువార్త శాంతి ప్రార్థన సంస్థ చైర్మన్ డాక్టర్ ప్రభుచరణ్ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెవ రెండ్ రాజాజీ ప్రసాద్, సునీత పాల్గొన్నారు.

బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

కాచిగూడ, మే 15 : బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ కోరారు. బుధవారం నింబోలిఅడ్డాలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ కులాల ఫెడరేషన్ల నియమ, నిబంధనలను మార్చాలని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్ నిమ్‌కార్, పులిజాల కృష్ణ పాల్గొన్నారు.

మల్లేపల్లిలో చోరీ ..

నగదు, ఆభరణాల అపహరణ

మెహిదీపట్నం, మే 15 : ఓ ఇంట్లో దొంగలు పడి నగదు, ఆభరణాలు అపహరించిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లేపల్లిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒవైసీ కమ్యూనిటీ సమీపంలో నివసించే యాసిన్ ఆటోడ్రైవర్. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వచ్చేసరికి తాళాలు పగులగొట్టి కనిపించాయి. హుమాయూన్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లో దొంగలు పడి 5 లక్షల 70 వేల నగదు, పదిహేనున్నర తులాల బంగారు ఆభరణాలు పోయాయని ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

రోడ్డు ప్రభావిత స్థలాల సేకరణ ఊసేది..

నిర్మాణదారులు స్థలాలు వదిలినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

ముషీరాబాద్, మే 15 : ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ – పార్శిగుట్ట ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఇబ్బందికరంగా మారుతున్నది. రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు ముందుకుసాగకపోగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన వారు రోడ్డు ప్రభావిత స్థలాలు వదిలినా జీహెచ్ఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారు. పార్శిగుట్ట మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. గ్రేటర్ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రాంనగర్ – పార్శిగుట్ట ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్మాణాలు చేపట్టే వారు సెట్ బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపడుతుండగా మరికొందరు రోడ్డు ప్రభావిత స్థలం వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా.. అడ్డుకోవడం లేదు. దాంతో వదిలిన స్థలాల్లో తిరిగి నిర్మాణాలు చేపతున్నారు. రోడ్డు విస్తరణ కోసం వదిలిన స్థలాల్లో కొత్తగా రోడ్డు వేయాల్సి ఉంటుంది.

పార్శిగుట్ట – రాంనగర్ రోడ్డులో సెట్ బ్యాక్ వదిలిన చోట మళ్లీ నిర్మాణాల దృశ్యం

ఏండ్లు గడస్తున్నా.. ఫలితం శూన్యం

ఏండ్లు గడస్తున్నా అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగానికి లేఖ రాయకపోవడం వల్లనే పనులు చేపట్టడం లేదని ఆ విభాగం అధికారులు చెప్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వైఖరి కారణంగా రోడ్డు విస్తరణ కోసం స్థలం వదిలి (వెనక్కి జరిగి) నిర్మాణాలు చేపట్టిన వారు పనైపోయిన తర్వాత ప్రహారీ ఏర్పాటు చేసుకున్నారు. పార్శిగుట్ట రోడ్డులో ఆరు భవనాలు, రాం నగర్ గుండు వద్ద ఒక భవనం, జామై ఉస్మానియా మలుపు వద్ద ఒక భవన నిర్మాణదారులు వదిలిన స్థలాలు జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకొని రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ షాపులు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం

రోడ్డు ప్రభావిత స్థలాల్లో మళ్లీ షాపులు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం. ప్రధాన రోడ్డులో భవన నిర్మాణ అనుమతికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టిన తర్వాత సెట్ బ్యాక్ స్థలాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగాన్ని కోరుతాం..

- హఫీజ్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, మే 15 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ అహ్మద్‌నగర్ కేబుల్ ఫీడర్‌లోని సయ్యద్‌నగర్ 1,2, అహ్మద్‌నగర్, ఫస్ట్‌లాన్సర్, బోలానగర్, శ్రీరాంనగర్, బడా బజార్, పోచమ్మ బస్తీ ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 : 30 నుంచి 9 గంటల వరకు, 11 కేవీ ఇలియాస్ రోడ్ ఫీడర్‌లోని ఏసీగార్డ్స్, ఎస్‌బీఐ బ్యాంక్, ఐడీబీఐ క్వార్టర్స్, ఆసియన్ అపార్ట్‌మెంట్, బజార్‌ఘాట్ చర్చి, ఏ – బ్యాటరీ లైన్, బజార్‌ఘాట్, బిలాల్ మసీద్, అమెక్స్ ప్రింటింగ్ ప్రెస్, పోలీస్ క్వార్టర్స్, శాంతినగర్, పిక్చర్ హౌస్, ఏసీ గార్డ్స్, బజార్ ఘాట్, గోకుల్‌నగర్, గ్లోరి థియేటర్, లక్డీకాపూల్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, గంగా జమున హోటల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

బడీడు పిల్లలను బడికే పంపాలి

డిప్యూటీ డీఈఓ బాలు నాయక్

అంబేద్కర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఈఓ బాలు నాయక్

మారేడ్‌పల్లి, మే 15: మోండా డివిజన్ రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం మారేడ్‌పల్లి జోన్ డిప్యూటీ డీఈఓ బాలు నాయక్, డిప్యూటీ ఐఓఎస్ మధన్‌మోహన్‌లతో కలిసి స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక సందర్శించారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను బస్తీ వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూ డీఈఓ బాలు నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా బడి ఈడు పిల్లలందరిని బడికి పంపించాలని, పిల్లలను పనికి పంపవద్దని సూచించారు. బస్తీ లో ఉన్న విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చే విధంగా బస్తీ వాసులు, పాఠశాల కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు లక్ష్మి, కోటమ్మ, చిన్న వీరయ్య, రౌతు రాజయ్య తదితరులు పాల్గొన్నారు

చిత్రం భళారే విచిత్రం : అమరవీరుల స్థూపం, ఆ పక్కనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కపక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. నిజానికి అమరవీరుల స్థూపం సచివాలయం ఎదురుగా ఉండగా, అంబేద్కర్ విగ్రహం హైమాక్స్ పక్కన్న ఉన్నది. కాని ఇక్కడ ఈ దృశ్యాన్ని చూస్తే పక్క పక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఇలాంటి అద్భుతమైన కట్టడాలను కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వాటిని ఏర్పాటు చేయించారు. అవి ఇప్పుడు పర్యాటక ప్రదేశాలుగా నిలిచాయి. నిత్యం వాటిని వందల సంఖ్యల్లో సందర్శించి సెల్ఫీలు దిగుతూ పరవశించిపోతుంటారు.

బాధ్యతగా.. విధులు నిర్వహిస్తా

అమీర్‌పేట్, మే 15 : రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ పేరు ప్రతిష్టలు పెంచేలా తన వంతు కృషి చేస్తానని డీవీ. రామకృష్ణ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా డి.వి. రామకృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 226వ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య నేతృత్వంలో సికింద్రాబాద్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తనకు సంఘ్ సికింద్రాబాద్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై డి.వి.రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘ్ ప్రతినిధులు డి.వి.రామకృష్ణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలు అప్పగించడంలో తన వంతు సహకారాన్ని అందించిన సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణి భానుప్రసాద్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ ప్రభు రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.